

8,092 మందికి కొత్త పెన్షన్లు : జెసి

ఏలూరు:జిల్లాలో 2,30,857 మందికి సంబంధించిన పెన్షన్ రూ.2500 నుండి రూ.2750కు పెంపుదల చేయడమే కాకుండా 8,092 మందికి కొత్త పెన్షన్లు మంజూరయ్యాయని జాయింట్ కలెక్టర్ పి.అరుణ్ బాబు చెప్పారు. మంగళవారం సిఎం జగన్ రాజమండ్రిలో వైఎస్ఆర్ పెన్షన్ కానుక వారోత్సవాల కార్యక్రమాన్ని ప్రారంభించగా జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుంచి జెసితో పాటు డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, ఏలూరు నగర పాలక సంస్థ అడిషనల్ కమిషనర్ బాపిరాజు, పలువురు పెన్షన్‌దారులు వీక్షించారు. అనంతరం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో కొత్తగా మంజూరైన వారికి జెసి పెన్షన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సర కానుకగా ప్రభుత్వం పెంచిన పెన్షన్ కింద జిల్లాలో 2,30,857 మంది వృద్ధాప్య, వితంతు, చేనేత, మత్స్యకార, కల్లుగీత కార్మికులు, చర్మకారులు, ఒంటరి మహిళలకు పింఛన్లు రూ.2500 నుండి రూ.2750కు పెంపుదల చేయడమైంది తెలిపారు.

చర్చిస్తూ.. తీర్మానిస్తూ..!



మహాసభలో మాట్లాడుతున్న గఫూర్

కార్యదర్శి నివేదిక అంశాలపై చర్చించిన ప్రతినిధుల

పలు తీర్మానాలు ఆమోదించిన మహాసభ

ఉద్యమాలతో నిర్బంధాలు తిప్పికొట్టాలి

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.గఫూర్

రెండో రోజు ఉత్సాహంగా సాగిన సిఐటియు రాష్ట్ర మహాసభ

ప్రజాశక్తి - భీమవరం

సిఐటియు 16వ రాష్ట్ర మహాసభను పురస్కరించుకుని షడ్రక్, సూర్యనారాయణ (అల్లూరి శ్రీరామరాజు కళ్యాణ మండపం)లో మంగళవారం ప్రతినిధుల సభ రెండోరోజు పలు అంశాలపై చర్చించి తీర్మానాలను ఆమోదించింది. తొలుత సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.గఫూర్ కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. రాష్ట్రంలో గత మూడేళ్ల కాలంలో సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పోరాటాలు, ఉద్యమాలు, సేవా కార్యక్రమాలతోపాటు జరిగిన లోటుపాట్లను గుర్తు చేశారు. ఇవన్నీ గమనంలో ఉంచుకోవడంతోపాటు రాబోయే కాలంలో ఐక్య కార్యాచరణ ద్వారా ఉద్యమాలను మరింత ఉధృతం చేయాలని దిశానిర్దేశం చేశారు. కార్యదర్శి నివేదికపై క్షుణ్ణంగా చర్చించిన 27 జిల్లాల కార్మిక ప్రతినిధులు తమ అభిప్రాయాలు తెలిపి ఏకగ్రీవంగా ఆమోదించారు. రాష్ట్రంలో ఉద్యమాలు, పోరాటాలు, సేవా కార్యక్రమాలు, కార్మిక సమస్యలతోపాటు ప్రజా సమస్యల పరిష్కారానికి చూపిన చొరవ, సాధించిన ఫలితాలను వివిధ జిల్లాల ప్రతినిధులు మహాసభ ముందుంచారు. కార్మిక ప్రతినిధులు పలు తీర్మానాలు మహాసభలో ప్రవేశపెట్టారు. దీనిలో ఏప్రిల్ ఐదో తేదీన చలో ఢిల్లీ, విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా, కనీస వేతనాల అమలుపై పోరాటాల ఆవశ్యకత వంటి తీర్మానాలను కార్మిక ప్రతినిధులు బలపర్చడంతోపాటు ఆమోదం తెలిపారు. ముందుగా సిఐటియు రాష్ట్ర నాయకులు అజయ్‌కుమార్ కరోనా విపత్కర పరిస్థితులు, ప్రమాదాలు, రైతాంగ ఉద్యమంలో మృతులకు సంతాపం తెలుపుతూ ప్రవేశ పెట్టిన తీర్మానాన్ని మహాసభ ఆమోదించింది.

నిర్బంధాలను సమరశీలంగా తిప్పికొట్టాలి

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.గఫూర్

మూడేళ్ల కాలంలో కార్మిక ఉద్యమాలపై ప్రభుత్వ నిర్బంధాలు ఎక్కువయ్యాయని, ఈ నేపథ్యంలో ఉద్యమాల ద్వారా నిర్బంధాలను తిప్పికొట్టాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.గఫూర్ పిలుపునిచ్చారు. గత ప్రభుత్వం కార్మిక నాయకులను నిర్బంధిస్తే ఈ ప్రభుత్వం గృహ నిర్బంధాలు చేస్తుందన్నారు. సమస్యలు పరిష్కరించని పాలకులు కొత్త సాకులు చూపుతూ దశాబ్దాల కాలంగా చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్న స్కీమ్‌వర్కర్లపై దాడులు విస్తృతం చేసిందన్నారు. షాపింగ్‌మాల్స్‌లో రూ.ఏడెనిమిది వేలతో పని చేస్తున్న కార్మికులకు కనీస సౌకర్యాలు ఉండటం లేదన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, షెడ్యూల్ రంగాల్లో వేలాది కార్మికులు పని చేస్తున్నా వారి సంరక్షణను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. వలస కార్మికులు జిల్లా, మండలాలకు వస్తే అక్కడ తహశీల్దార్ వద్ద నమోదు చేసి వేతనాలు, సౌకర్యాలు కల్పించాలని రిజిస్టర్ నిర్వహించాలని చట్టం చెబుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఇటీవల కాలంలో కార్మికులు వలసలు వెళ్తూ ప్రమాదంలో చనిపోయిన వారికి పరిహారం సక్రమంగా ఇవ్వడం లేదని విమర్శించారు. 2019 తర్వాత చిరుద్యోగులపై వేధింపులు ఎక్కువయ్యాయన్నారు. అనంతపురంలో వికలాంగులైన వి.ఎ.ఎ విధి నిర్వహణలో వేధించి బలవన్మరణానికి ఈ పాలకులు కారకులయ్యారన్నారు. ఆశా, అంగన్వాడీలను తొలగించాలని ఎంఎల్ఎలు, స్థానిక ప్రజాప్రతినిధులు పదేపదే ఒత్తిడి చేస్తున్నారని, చిరుద్యోగులను టార్గెట్ చేయడం మానుకోవాలని హెచ్చరించారు. కార్మికులు తమ వేతనాలు, ఉపాధిపై ఆందోళన చేస్తుంటే యజమానులు గూండాలను (బౌన్సర్లు) తీసుకొచ్చి కార్మికులపై దాడులకు పాల్పడుతున్నారన్నారు. ఆంధ్రుల హక్కు విశాఖ ఉక్కును ప్రయివేటీపరం వ్యతిరేకంగా 690 రోజులుగా అక్కడి కార్మికుల ఆందోళన చేస్తున్నారని తెలిపారు. కేంద్రం మాత్రం నిరంకుశంగా ముందుకు సాగుతుందన్నారు. ఈ మహాసభలో విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం కార్యాచరణ రూపొందిస్తామన్నారు. మూడేళ్ల కాలంలో సంఘం ఆధ్వర్యంలో కార్మికులు, కర్షకుల సమస్యలపై అలుపెరుగని పోరాటం చేశామన్నారు. గత పోరాటాల అనుభవాలతో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు.



సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గఫూర్, నేతలు


డబుల్ ఇంజిన్ ప్రభుత్వాన్ని త్రిబుల్ ఇంజిన్ల (కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘం)తో ఎదుర్కొంటాం

సిఐటియు రాష్ట్ర మహాసభలో ఎపి వ్యకాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు

దేశంలో మోడీ, అమిత్ షా (అంబానీ, అదాని) డబుల్ ఇంజిన్ ప్రభుత్వం కార్మికులు, శ్రామికులపై చేస్తున్న దాడులను త్రిబుల్ ఇంజిన్ల (కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికుల) సహకారంతో ఎదుర్కొందామని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. భీమవరంలో జరుగుతున్న సిఐటియు 16వ రాష్ట్ర మహాసభలో ఆయన పాల్గొని వ్యవసాయ కార్మిక సంఘం తరపున సౌహార్ద్ర సందేశం అందించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేశంలో బిజెపి, ఆర్ఎస్ఎస్ విధానాల వల్ల కార్మికులు, రైతులపై దాడులు విస్తృతమయ్యాయన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ శ్రామికులకు ఉపాధి లేకుండా చేస్తుందన్నారు. నూతన ఆర్థిక విధానాలు అమలైన తర్వాత వ్యవసాయ రంగం పెట్టుబడిదారీ వ్యవసాయం గ్రామీణ ప్రాంతాలకు వచ్చిందన్నారు. ఈ ప్రభావంతో గ్రామీణ ప్రాంత వ్యవసాయ కార్మికులపై మరింత భారం పడిందన్నారు. ఈ కాలంలో వ్యవసాయ రంగాల్లో యాంత్రీకరణ పెరిగి, వ్యవసాయ కార్మికులు గ్రామీణ వ్యవసాయేతర కార్మికులుగా మారారన్నారు. యాంత్రీకరణ పెరగడం వల్ల వ్యవసాయంలో ఏడాదికి 50 రోజులైనా పనులు దొరకడం లేదని, దీనివల్ల వ్యవసాయ కార్మికులు వలసలు వెళ్లిపోతున్నారని అన్నారు. ప్రతిరోజూ వలస కార్మికులు చనిపోతున్నా పాలకులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. గ్రామీణ శ్రామికులు 48 రకాల వ్యవసాయేతర పనులకు వెళ్తున్నారన్నారు. వ్యవసాయేతర రంగాల్లో పని చేస్తున్న శ్రామికులకు కార్మిక సంఘాలు తోడుండాలని సూచించారు. రాష్ట్రంలో అభివృద్ధి పేరుతో 2013 భూసేకరణ చట్టానికి విరుద్ధంగా 5.50 లక్షల ఎకరాల (భూబ్యాంక్) భూములు సేకరించారన్నారు. ఆ భూములు పేదలకు తిరిగివాలని ఆందోళన చేస్తుంటే దీక్ష వద్దకు వచ్చి ఆరు నెలల్లో మన ప్రభుత్వం వస్తుందని, భూ సమస్య పరిష్కారమవుతుందని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్ నాలుగేళ్లవుతన్నా ఎందుకు సమస్యను పరిష్కరించలేదని స్పష్టం చేయాలన్నారు. రాష్ట్రంలో ఉన్న భూసమస్యను పరిష్కరించాలన్నారు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు ఐక్యమై ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న సిఐటియు తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు



వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు



సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు




సిఐటియు రాష్ట్ర కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్





చర్చల్లో ఏలూరు జిల్లా నుంచి మాట్లాడుతున్న జి.రాజు, సుభాషిణి





పశ్చిమగోదావరి జిల్లా నుంచి మాట్లాడుతున్న కర్రి నాగేశ్వరరావు, హసీనా బేగం



ఏలూరు రూరల్ మండలంలో రాస్తారోకో చేస్తున్న రైతులు, నాయకులు

ధాన్యం బస్తాలతో రైతులు ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు రూరల్

చాటపర్రు, మాదేపల్లి, జాలిపూడి, మల్కాపురం గ్రామాల్లో రైతులు, కౌలు రైతుల నుండి ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మిల్లర్లకు బ్యాంకు గ్యారంటీలు లేకపోవడంతో కొనుగోలు కేంద్రాల్లో ట్రక్ షీట్లు జనరేట్ కాక ధాన్యం కొనుగోలు నిలిచిపోవడంపై ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో జాలిపూడి - కాట్లంపూడి రోడ్డుపై ధాన్యం బస్తాలతో రైతుల నిరసన వ్యక్తం చేశారు. ముందుగా రైతు సంఘం నాయకులు జాలిపూడి, చాటపర్రు, కాట్లంపూడి గ్రామాల్లో పర్యటించి ధాన్యం కొనుగోలు సమస్యలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం బస్తాలతో లోడ్ చేసిన ట్రాక్టర్లు, లారీలు మిల్లుల వద్ద, బస్తాల్లోకి ఎక్కించిన ధాన్యం పొలాల్లో ఉండిపోయిందని రైతు సంఘం నాయకుల వద్ద రైతులు వాపోయారు. తమ ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ మిల్లర్లకు బ్యాంకు గ్యారంటీలు లేవనే పేరుతో ఆన్‌లైన్ పనిచేయక ట్రక్ షీట్లు జనరేట్ కాక ధాన్యం కొనుగోలు నిలిపివేయడం అన్యాయమని ఆయన విమర్శించారు. మిల్లర్ల నుండి బియ్యం తీసుకోకపోవడం వల్ల ఈ సమస్య వచ్చిందని అధికారులు, మిల్లర్లు చెబుతున్నారని అయితే ఈ సమస్య వల్ల రైతుల నుండి ధాన్యం సేకరించకపోవడం దారుణమన్నారు. ట్రాక్టర్లు, లారీలలోకి ధాన్యం బస్తాలు లోడ్ చేయడంతో రోజుల తరబడి ధాన్యం బస్తాలు వాహనాల నుండి దించకపోవడం వల్ల కిరాయిలు పెరిగి పోతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో లక్ష్మణరావు, సత్యనారాయణ, రాంబాబు, సుబ్బారావు పార్వతీశ్వరరావు పాల్గొన్నారు.

పెదపాడు:ధాన్యం కొనుగోలు నిలిచిపోవడంతో మండలంలోని కొత్తూరులో ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో మంగళవారం అన్నదాతలు రోడ్డెక్కారు. ధాన్యం కొనుగోలు చేయాలంటూ రాస్తారోకో నిర్వహించారు. దీంతో ట్రాఫిక్ స్తంభించింది. రైతులకు, పోలీసులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ తహశీల్దార్‌తో ఫోన్లో మాట్లాడటంతో బుధవారం సాయంత్రానికి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు రాస్తారోకో విరమించారు. ఈ సందర్భం గా కె.శ్రీనివాస్ మాట్లాడారు. సమస్య పరిష్కరించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కడిమి శ్రీనివాసరావు, సిహెచ్ సురేష్, సిహెచ్.వీరబాబు, వి.సత్యనారాయణ, ఎం.గంగాధరరావు, సిహెచ్.వాసు, దన్నే వెంకటేశ్వరరావు, ఆవాల మోహనరావు, చెడుగొండి వెంకటేశ్వరరావు, రాంబాబు పాల్గొన్నారు.

ముదినేపల్లి:ధాన్యం లోడుచేసి వారం రోజులవుతున్నా ఇప్పటి వరకూ మిల్లర్లు దిగుమతి చేసుకోవడం లేదంటూ మండలంలోని పెదపాలపర్రు వద్ద మంగళవారం సాయంత్రం పామర్రు-కత్తిపూడి-214 జాతీయ రహదారిపై రైతులు ధాన్యపులోడుతో ఉన్న ట్రాక్టర్లను రోడ్డుకు అడ్డంగా పెట్టి రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ధాన్యం అమ్ముకునేందుకు రైతులు రోజులు తరబడి పడిగాపులు పడాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. సుమారు గంటపాటు రాస్తారోకో చేశారు. గుడివాడ-ముదినేపల్లి రోడ్డులో వందలాది వాహనాలు రెండు కిలోమీటర్ల మేర రోడ్డుకు ఇరువైపుల నిలిచిపోవడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అదేసమయంలో అక్కడకు చేరుకున్న మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్, పిసిసి నాయకులు తులసీరెడ్డి రైతులకు సంఘీబావం తెలిపి రాస్తారోకోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ సాయంత్రంలోగా ధాన్యం కొనుగోలు చేయకపోతే బుధవారం తాను దీక్షకు కూర్చుంటానన్నారు. కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులను కంటతడి పెట్టించిన ప్రభుత్వాలు కాలగర్భంలో కలిసిపోతాయన్నారు. సమాచారం అందుకున్న తహశీల్దార్ శ్రీనివాసరావు అక్కడకు చేరుకుని గంటలోగా ధాన్యం దిగుమతులు చేసేందుకు చర్యలు తీసుకుంటామని, రైతులు రాస్తారోకో విరమించాలని కోరారు. దీంతో శాంతించిన రైతులు రాస్తారోకో విరమించారు. ఎస్ఐ షణ్ముఖసాయి తన సిబ్బందితో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ఆదర్శప్రాయులు సావిత్రిబాయి పూలే

ప్రజాశక్తి - ఏలూరు

ఆదర్శప్రాయులు, చదువుల తల్లి, తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే గొప్ప మహిళ అని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి కొనియాడారు. పూలే జయంతి సందర్భంగా ప్రజా సంఘాలు, సిపిఎం తరపున స్థానిక ఏలూరులోని జిల్లా పరిషత్ సెంటర్‌లోని పూలే విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూలే 150 ఏళ్ల క్రితమే మహిళలు చదువుకోవాలని, విజ్ఞానాన్ని సంపాదించాలని, పురుషులతో పాటు సమానంగా ఎదగాలని కోరుకున్నారన్నారు. ఆ కాలంలో ఆమె చదువుకోవడం కోసం, తోటి మహిళలకు చదువు చెప్పేందుకు అనేక ఇబ్బందులు, దాడులను సైతం లెక్కచేయక భర్త సహకారంతో చదువుకున్న మహిళగా గుర్తింపు పొందారన్నారు. ఆమె చదువుకోవడమే కాకుండా, అనేకమంది మహిళలకు, ముఖ్యంగా దళిత మహిళలకు చదువు చెప్పిన ఘనత ఆమెదని కొనియాడారు. ఆమె చదువుల తల్లిగానే కాకుండా తొలి మహిళ ఉపాధ్యాయురాలుగా గుర్తింపు పొందారన్నారు. ఈ కాలంలో కూడా మహిళలను తక్కువగా చూడడం, బాబు, పాప పుడితే మగ పిల్లవాడిని చదువుకు పంపడం, ఆడపిల్లను వంటగదికి పరిమితం చేయడం వంటి వివక్ష కొన్ని కుటుంబాల్లో నేటికీ కొనసాగుతుందన్నారు. మనమందరం పూలేను ఆదర్శంగా తీసుకుని పురుషుల తోపాటు సమానంగా మహిళలను కూడా చూడాలని, మరి ముఖ్యంగా దళిత మహిళలను అన్ని విధాల ప్రోత్సహించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ, సిపిఎం నాయకురాలు శ్యామలారాణి పాల్గొన్నారు.

ర్యాలీలు, రోడ్‌షోల నియంత్రణ జిఒను ఉపసంహరించాలి : సిపిఎం

ఏలూరు:రాష్ట్రంలో రోడ్‌షోలు, ర్యాలీలు నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జిఒను తక్షణం ఉపసంహరించుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికే ఈ జిఒ తీసుకొచ్చిందని తెలిపారు. పోలీసులకు సర్వాధికా రాలు కట్టబెట్టడం ప్రజాస్వామ్య వ్యవస్థకే ప్రమాదమని, పోరాడి సాధించుకున్న పౌరహక్కులను, ఏ పేరుతో అణచివేసినా సిపిఎం వ్యతిరేకిస్తుందని పేర్కొన్నారు. కందుకూరు, గుంటూరు ఘటనలను ఆసరా చేసుకొని రాష్ట్ర, మున్సిపల్, పంచాయతీ రోడ్స్‌లో సభలు, ర్యాలీలు, రోడ్‌షోలు నిషేధించడం అప్రజాస్వామి కమన్నారు. రోడ్లపైన ర్యాలీలు, సభలు జరిపితే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయనుకుంటే గుంటూరు గ్రౌండ్‌లో సభ జరిపినప్పటికీ దుర్ఘటన జరగడం, పోలీసు వైఫల్యం స్పష్టంగా కనపడు తోందని, రాష్ట్ర ప్రభుత్వం తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి ప్రజాస్వామ్య, పౌరహక్కులను కాలరా యటానికి ఇలాంటి జిఒలు తీసుకురావడం గర్హనీయమని తెలిపారు. ఇప్పటికే కార్మికులు, రైతులు, ప్రజలు తమ కోర్కెలు, హక్కులకోసం ఆందోళనలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం అణచి వేస్తుందన్నారు. ముందస్తు అరెస్టులు చేస్తోందని, సభలకు, ర్యాలీలకు అనుమతినివ్వడంలేదని, ఉన్న గ్రౌండ్‌లు కూడా ప్రభుత్వం ఆక్రమించుకుని పట్టణాల్లో ఖాళీ స్థలమన్నది లేకుండా చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఊరికి దూరంగా ప్రజల తో సంబంధం లేకుండా సభలు జరుపుకోవడం సిపిఎంకు ఆమోదయోగ్యం కాదన్నారు. ప్రధాన పట్టణాల్లో సభలు జరుపుకోడానికి అవసరమైన మైదానాలను కేటాయించాలని, ప్రదర్శనలకు అనుమతి వ్వాలని, ఈ జిఒ అమలు చేయడమంటే ప్రజలు, ప్రతిపక్షాలు, ప్రజా తంత్రవాదుల నోరు నొక్కే ప్రయత్నమేనని విమర్శించారు. నిరసన తెలియజేసే హక్కును కూడా నిషేధిస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం రోడ్‌షోలు, ర్యాలీలు నియంత్రించే జిఒను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా తంత్రవాదులు, అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, పౌరహక్కుల సంఘాలు, న్యాయకోవిదులు దీన్ని వ్యతిరేకిస్తూ ముందుకు రావాలని కోరారు.

తెలుగు రాష్ట్రాల్లో కార్మికులపై పెరిగిన నిర్బంధం

సిఐటియు తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్

ప్రజాశక్తి - భీమవరం


ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కార్మికులపై నిర్బంధం పెరిగిందని సిఐటియు తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్ అన్నారు. సిఐటియు 16వ రాష్ట్ర మహాసభకు విచ్చేసిన ఆయన ఆ కమిటీ తరపున సౌహార్ద్ర సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా జె.వెంకటేష్ మాట్లాడుతూ ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకే విధానాలు అవలంబిస్తున్నాయన్నారు. వైఎస్.జగన్ పాదయాత్రలో కార్మికులకు ఆశలు, ఆకాంక్షలు కల్పించి అధికారంలోకి వచ్చిన మూడేళ్ల కాలం గడుస్తున్నా హామీలు అమలు నోచుకోలేదన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు గడిచినా కార్మికుల మౌలిక సమస్యలను పట్టించు కోవడం లేదన్నారు. ఈ కాలంలో ఆంధ్ర రాష్ట్రంలో గృహనిర్బంధం, అరెస్టులు, వేధింపులు మరింత పెరిగాయన్నారు. ఇది కార్మిక ఉద్యమాలకు అవరోధంగా మారిందన్నారు. ఉమ్మడి హైదరా బాదులో ధర్నా చౌక్, ఇందిరాపార్క్ వద్ద సుదీర్ఘ పోరాటాలు సమ్మెలు, ధర్నాలు జరిగాయని, అప్పటి చంద్రబాబు ప్రభుత్వం కు వ్యతిరేకంగా అంగన్వాడీ ఉద్యోగులు పోరాటం చేస్తే చంద్రబాబు మోపిన ఉక్కు పాదంపై ధర్నా చౌక్ ఉద్యమ కేంద్రంగా ఉందన్నారు. ఆ ధర్నా చౌక్‌ను కెసిఆర్ ప్రభుత్వం నిషేధించిందని, హైకోర్టు జోక్యంతో ధర్నాచౌక్ పునరుద్ధరణ జరిగిందన్నారు. హైకోర్టు జోక్యంతోపాటు సిఐటియు, ప్రజా సంఘాలు ప్రజా హక్కుల కోసం పోరాటాలు జరిగాయన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన ఎనిమిదేళ్ల కాలంలో అనేక ఉద్యమాలు కార్మికుల పక్షాన జరిగాయన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన పోరాటాల్లో వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ఉద్యమం స్ఫూర్తిగా నెలకొం దన్నారు. చాలాకాలంగా ఆంధ్రుల హక్కు విశాఖ ఉక్కు అనే పదం తెలంగాణలో ఆంధ్రుల హక్కు తెలుగు ప్రజల హక్కుగా మా రాష్ట్రంలో ఉద్యమించామన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పెద్ద ప్రభుత్వ రంగ సంస్థగా ఉందని, తెలంగాణలో సింగరేణి బొగ్గు కూడా అలాంటిదేనని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్మికోద్యమంలో వైజాగ్ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ ఉద్యమం ఓ మైలురాయి అని అన్నారు. మా రాష్ట్రంలో 73 షెడ్యూల్ పరిశ్రమలలో కార్మికులు కనీస వేతనాలు అమలు కోసం ఉద్యమాలు నిరంతరం కొనసాగుతున్నాయని అన్నారు. 2007 ఉమ్మడి షెడ్యూల్ రంగాల కార్మికులకు వేతనాలు పెరుగుదల లేదన్నారు. గత సంవత్సరం సెప్టెంబర్ నెలరోజుల పాటు 400 కిలోమీటర్లు పాదయాత్ర చేసి కార్మికులను కలిసి స్వతంత్ర ఐక్య కార్యాచరణతో ఐదు జిఒలను ప్రభుత్వం విడుదల చేసినా ఇప్పటికి గెజిటెడ్ నోటిఫికేషన్ ఇవ్వలేదన్నారు. ప్రభుత్వ రంగ పరిరక్షణ కోసం కేంద్ర రాష్ట్ర రంగాలతో పాటు షెడ్యూల్,ఉపాధి స్కీమ్ వర్కర్ల సమస్యలపై రెండు ప్రాంతాల్లోనూ ఉద్యమిస్తున్నామన్నారు. నేడు కార్మిక వర్గం మరింత సవాళ్లు ఎదుర్కొంటుందని, కార్మికులు ఐక్యం కావాల్సిన అవసరం ఉందని అన్నారు.

పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

వ్యకాస డిమాండ్

ప్రజాశక్తి - కుకునూరు

పోలవరం ప్రాజెక్టు వల్ల సర్వం కోల్పోయిన నిర్వాసితులకు తక్షణం రూ.10 లక్షల పరిహారం చెల్లించాలని, నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు యర్రంశెట్టి నాగేంద్రరావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో నాగేంద్రరావు మాట్లాడుతూ నిర్వాసితుల త్యాగాల పునాదులపై పోలవరం ప్రాజెక్టును నిర్మిస్తున్నామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఓ వైపు అంటూనే ప్రాజెక్టు నిర్మించడంలో ఉన్న శ్రద్ధ నిర్వాసితులకు పునరావాస పరిహారం చెల్లించడంలో లేదన్నారు. గోదావరి వరదల వల్ల సర్వం కోల్పోయి కట్టుబట్టలతో ఇళ్లను వదిలి చెట్టుకొకరు, పుట్టకొకరుగా చెల్లాచెదురై తలదాచుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని, ఇళ్లు కోల్పోయిన వారికి నేటికీ ఇంటి నష్ట పరిహారం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తంచేశారు. నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను జగన్ ప్రభుత్వం నెరవేర్చాలని కోరుతూ ఈ నెల ఐదో తేదీన జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ కార్యాలయం ముందు వ్యకాస, గిరిజన, నిర్వాసితుల సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న ధర్నాలో నిర్వాసితులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో వ్యకాస నాయకులు బయ్యన శ్రీను, ఎం.బాబు, పాషా పాల్గొన్నారు.



శరణిని అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు

జాతీయ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు శరణి

ప్రజాశక్తి - కలిదిండి

జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి కె.శరణి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు బి.స్వర్ణకుమారి తెలిపారు. గత నెల 29 నుంచి 31 వరకు కడప జిల్లా పొద్దుటూరు పూజ ఇంటర్నేషనల్ స్కూల్ ఆవరణలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో బాల్ బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయన్నారు. 14 ఏళ్ల లోపు విభాగంలో తొమ్మిదో తరగతి విద్యార్థి కె.శరణి రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికైందన్నారు. విద్యార్థి శరణి, తర్ఫీదు ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు బత్తిన కృష్ణకుమారి, మావుల్లేశ్వరరావుకు ఎంఇఒ కె.నరేష్‌కుమార్, విద్యాకమిటీ ఛైర్మన్ హురుముతున్నిసా, పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

'ప్రశ్నిస్తే దాడులు దుర్మార్గం'

ప్రజాశక్తి - ఉంగుటూరు

ప్రశ్నిస్తే దాడులు చేయడం దారుణమని జనసేన ఉంగుటూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి పత్సమట్ల ధర్మరాజు అన్నారు. ఉంగుటూరు పార్టీ కార్యాలయం వద్ద నియోజకవర్గ స్థాయిలో దళిత యువత ఆధ్వర్యంలో మంగళవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యువత మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులు పథకాలను రద్దు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి అని విమర్శించారు. ప్రజల్లో ఆదరణ కోల్పోతుండటంతో ప్రతిపక్ష నాయకులపై దాడులు చేయడం సిగ్గుచేటన్నారు. మహాసేన రాజేష్ ప్రభుత్వ పనితీరును నాయకుల అవినీతిని ప్రశ్నిస్తూ ఎప్పటికప్పుడు వారి బండారం బయట పెడుతుండటంతో ఆందోళన చెంది దాడులకు దిగుతున్నారన్నారు. అనంతరం ఈ నెల 12వ తేదీన రణస్థలంలో నిర్వహించే యువశక్తి పోస్టర్‌ను ధర్మరాజు ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి గంగమోలు చిన్నరత్తయ్య, ఇల్లిందల సురేష్, మీసాల ప్రసాద్ బోనాల నారాయణ, కొమ్ము పెద్దిరాజు, వడ్డీ వెంకట్, దౌలురి సునీల్, పాకా ప్రేమ్‌కుమార్, మూదునురి ప్రసాద్, తోట పవన్, గెద్దం వెంకటేష్, బోయిన రాంబాబు పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెంలో మాట్లాడుతున్న సిఐ సురేష్‌బాబు

పేకాట శిబిరాలు నిర్వహిస్తే చర్యలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జూద క్రీడలను వీడనాడాలని సిఐ సురేష్‌బాబు సూచించారు. మండలంలోని దేవులపల్లిలో సర్పంచి దోరేపల్లి సత్యనారాయణ సమక్షంలో ప్రజలకు జూద క్రీడాల వల్ల కలిగే అనర్థాల గురించి మంగళవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ బాలసురేష్‌బాబు మాట్లాడుతూ రానున్న సంక్రాంతి పండుగ నేపథ్యంలో పేకాట, కోడిపందేలు నిర్వహించరాదని తెలిపారు. గతంలో జూద క్రీడల నిర్వహించిన వారిపై బైండోవర్ కేసులు పెట్టినట్లు చెప్పారు. జూద క్రీడల నివారణకు పోలీసు వారు తీసుకుంటున్న చర్యలకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ దుర్గమహేశ్వరరావు పాల్గొన్నారు.

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని సిఐ బాలసురేష్‌బాబు హెచ్చరించారు. మండలంలోని శ్రీనివాసపురం గ్రామంలో సంక్రాంతి ముసుగులో జరిగే జూద క్రీడలు వల్ల జరిగే అనర్థాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ బాలసురేష్‌బాబు మాట్లాడుతూ సాంప్రదాయ పండుగలను ప్రజలు సంతోషంగా జరుపుకోవాలని సూచించారు. ఇప్పటికే జూద క్రీడల నిర్వహణలో భాగస్వాములైనవారిని గుర్తించి 40 మందిపై బైండోవర్ కేసు నమోదు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సాగర్‌బాబు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాలల్లో కోడిపందేలు,పేకాట వంటి జూదాలు జరగకుండా మహిళా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఆగిరిపల్లి ఎస్ఐ ఎన్.చంటిబాబు ఆదేశించారు. ఆగిరిపల్లి పోలీస్‌స్టేషన్‌లో మహిళా పోలీసులకు ఆయన మంగళవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. గతంలో కోడిపందేలు, పేకాట కేసుల్లో నిందితులైన 26 మందిని గుర్తించి వారిని ముందస్తుగా బైండోవర్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని మహిళా పోలీసులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని చీపురుగూడెం గ్రామం ఎస్‌సి కాలనీలో అబ్బదాసరి రాయప్ప పూరిల్లు అగ్నిప్రమాదంలో దగ్ధమైంది. సోమవారం రాత్రి షాక్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగడంతో పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది. రోజువారికూలి పని చేసుకుని జీవనం సాగించే నిరుపేదలైన అబ్బదాసరి రాయప్ప కుటుంబ సభ్యులకు కట్టు బట్టలు మాత్రమే మిగిలాయి. వంట సామగ్రి, మంచాలు, బట్టలు, ఆధార్, రేషన్ కార్డులతో సహా పూర్తిగా కాలిపోవటంతో నిరాశ్రయులయ్యారు. వారికి మంగళవారం గ్రామ సర్పంచి సరోజిని, వైసిపి గ్రామ నాయకులు వెంకటేశ్వరరావు, చీకటి శ్రీనివాసరావు 25 కేజీల బియ్యం, కూరగాయలు, సరుకులు, బట్టలు, దుప్పట్లు అందించారు. గ్రామ కార్యదర్శి ఎస్‌కె.నిషాక్ ఆలీ, తగరం సోమయ్య, భీమయ్య ఉన్నారు.

సారా విక్రేతలపై కేసు

ప్రజాశక్తి - నూజివీడు

నూజివీడు నియోజకవర్గ పరిధిలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిబ్బంది దాడిలో సారా విక్రేతలపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా నూజివీడులో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిఐటి గోపాలకృష్ణ మంగళవారం మాట్లాడుతూ నూజివీడు నియోజకవర్గంలో నిర్వహించిన దాడిలో నలుగురు వ్యక్తులు సారా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 14 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలో నాటు సారా తయారీ క్రయవిక్రయాలకు పాల్పడిన, అక్రమ మద్యం కలిగి ఉన్న కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇలాంటి ఘటనలపై స్థానికులు తమకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - మండవల్లి

చేపల చెరువుపై కాపలాదారునిగా పనిచేస్తున్న వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన మండలంలోని కానుకొల్లులో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కానుకొల్లులోని మెతుకుల సత్యనారాయణకు చెందిన రొయ్యల చెరువుపై అస్సాంకు చెందిన నికులాష్ బాగ్లరీ కాపలాదారునిగా పని చేస్తున్నాడు. సత్యనారాయణ చెరువును లీజుకు తీసుకున్న సాయి శుక్రవారం ఉదయం ఏడున్నర గంటల సమయంలో చెరువు దగ్గరకు వెళ్లి చూడగా నికులాస్ బాగ్లరీ తను ఉంటున్న రేకుల షెడ్డులో దూలానికి ఉరివేసుకుని ఉన్నట్లు గమనించి పక్కచెరువుపై కాపలాదారునిగా పనిచేస్తున్న నికులాష్ సోదరుడైన మైఖేల్ బాగ్లరీకి సమాచారం అందించాడు. ఈ మేరకు మైఖేల్ బాగ్లరీ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసుకున్న ఎస్ఐ రామకృష్ణ మృతదేహానికి మంగళవారం పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు తెలిపారు.

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు



ఏలూరులో...

ప్రజాశక్తి - ఏలూరు

బాలగంగాధర్ తిలక్ ఓరియంటల్ కార్పొరేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను యుటిఎఫ్ నాయకులు అప్పారావు అధ్యక్షతన ఐద్వా మహిళా సంఘం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి తేజశ్రీ, ఐద్వా జిల్లా కన్వీనర్ హైమావతి మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే మహిళల విద్య కోసం ఎంతో కృషి చేశారన్నారు. ప్రభుత్వ విధానాల వల్ల విద్య అనేది నిర్వీర్యం అవుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో, కాలేజీల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ షడ్రక్ ఉపాధ్యాయులు కిరణ్, సత్యనారాయణ, రామ్‌కుమార్, జి.రామలక్ష్మి పాల్గొన్నారు.

బిసి సంక్షేమ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సావిత్రిపూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు శాఖ, ఉమెన్ ఎంపవర్‌మెంట్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జన్మదినాన్ని పురస్కరించుకుని ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఏలూరు టౌన్ : సావిత్రిబాయి పూలే జయంతి రోజున జాతీయ మహిళ ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలని బిసి హక్కుల సాధన పోరాట వేదిక జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు తెలిపారు. దేశ తొలి ఉపాధ్యాయురాలు సావిత్రి బాయ్ పూలే జయంతి వేడుక స్థానిక ఆర్ఆర్ పేటలోని బిసి హక్కుల సాధన పోరాట వేదిక ఆధ్వర్యంలో ఆ సంఘం జిల్లా కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. తొలుత సావిత్రి బాయి పూలే చిత్రపటానికి సుందరయ్య గ్రంథాలయం నిర్వాహకులు కంది విశ్వనాథం పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పిచ్చుక ఆదిశేషు మాట్లాడుతూ బాలిక విద్య కోసం పరుగులు పెట్టడం కోసం సావిత్రిబాయి పూలే చేసిన త్యాగాలు కనపరిచిన పట్టుదల మనకు మనందరికీ ఆదర్శనీయమన్నారు. నేటి పాలకులు నూతన విద్యా విధానం పేరుతో పాఠశాల విద్యార్థులకు విద్యను దూరం చేయటం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో బిసి సంఘం నాయకులు ఉక్కుసూరి చందనాడ నందీశ్వరరావు, కిన్జంగి రాజు, వి.కిషోర్, కొత్తల శివకుమార్, దాకోజు దుర్గాసురేష్, ఎ.రామారావు, సత్యం మాట్లాడారు.

చింతలపూడి : భారతదేశపు తొలి మహిళా ఉపాధ్యాయురాలు, సావిత్రిబాయి పూలే అని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎంవి.అప్పారావు అన్నారు. మండలంలో సావిత్రిబాయి పూలే 192వ జయంతి సందర్భంగా, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చాట్రాయి : మండలంలోని చనుబండ సెంటర్‌లో సావిత్రి బాయ్ పూలే జయంతి సందర్భంగా మోరంపూడి ఆధ్వర్యంలో ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో తల్లాడ శ్రీనివాసరావు, మోదుగు ముత్తయ్య, గుడిమల్ల బ్రహ్మయ్య, నోముల గోపాలకృష్ణ, నక్కా చెన్నారావు పాల్గొన్నారు.

దెందులూరు : మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి బాయ్ పూలే జయంతిని దెందులూరు నియోజకవర్గంలో పలు పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. తొలుత సావిత్రిబాయ్ పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సావిత్రిబాయి పూలే గొప్పతనాన్ని గురించి విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు వివరించారు. మహిళా ఉపాధ్యాయులకు జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చాట్రాయి : మండల కేంద్రమైన చాట్రాయిలో బిఎస్‌పి మండల అధ్యక్షులు కారుమంచి ధనుష్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి చాట్రాయి మాజీ సర్పంచ్ కోటా జోషి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ధనుష్ మాట్లాడుతూ సావిత్రిబాయి తన భర్త జ్యోతిరావు పూలేతో కలిసి 1848 జనవరి 1న పూణేలో మొట్టమొదటగా బాలికల పాఠశాల ప్రారంభించారని, కుల వ్యవస్థకు, పితృస్వామ్యానికి మహిళల సకల హక్కుల కోసం పోరాటం చేయడం తమ సామాజిక బాధ్యతగా ఆ దంపతులు విశ్వసించారన్నారు. అందుకోసం ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి సమిష్టిగా పోరాటం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం నాయకులు దుర్గం పుల్లారావు, చాట్రాయి గ్రామ మాజీ సర్పంచి కోట జోషి, అడిమెల్లి లాజరు, రాపాక మోహన్ పాల్గొన్నారు.



మండవల్లిలో...



గణపవరంలో...

గణపవరం : గణపవరం డిగ్రీ కాలేజీలో మంగళవారం సావిత్రి బాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి మాట్లాడుతూ సావిత్రి బాయి పూలే మొదటి మహిళా ఉపాధ్యాయులన్నారు. సంఘ సంస్కర్తగా మహిళల విద్యా వ్యాప్తి కోసం జీవితాంతం కృషి చేసిన వ్యక్తి అని అన్నారు. సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ వైస్ ప్రిన్సిపల్ పి.మధురాజు, లెక్చర్లు టి.అక్కిరాజు, సిహెచ్.అనురాధ, ఎన్‌విఎన్‌డి.శ్రీనివాసు, జివి.శారదాదేవి, కె.స్వరూపరాణి పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : భారత దేశ తొలి ఉపాధ్యాయిని, సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలను స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. పూలే విగ్రహానికి ప్రధానోపాధ్యాయులు గడా జగ్గారావు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాలికలు, మహిళల, బడుగు వర్గాల కోసం పూలే దంపతులు చేసిన కృషిని, అసమాన ధైర్యాన్ని ప్రతి ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకుని, విద్యా వ్యాప్తికి కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఫస్ట్ అసిస్టెంట్ సుధాకర రెడ్డి, స్కౌట్, ఎన్‌సిసి విద్యార్థులు, కో-ఆర్డినేటర్స్ శ్రీహరి బాబు, అల్లాహ్ భక్ష్, ఉపాధ్యాయులు, మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు. స్థానిక త్రివేణి ప్రసాద్ జూనియర్ కళాశాలలో బిసి, ఎస్‌సి, ఎస్‌టి మైనార్టీ హక్కుల సాధన ఐక్య వేదిక ఆధ్వర్యంలో చిట్టిబోయిన రామలింగేశ్వరరావు అధ్యక్షతన సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దాసరి శ్యామ్ చంద్ర శేషు సావిత్రి బాయి పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కోనేటి చంటి, కళాశాల ప్రిన్సిపల్ హెచ్‌బి.ప్రసాద్, కొంచాడ ప్రసాద్, గుల్లపూడి శ్రీదేవి, చిత్తపురి దుర్గష్, మల్లిపూడి నవీన్, తాళ్లూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మండవల్లి : ఆడపిల్లలు చదువుకోకూడదని శాసిస్తున్న కాలంలో శ్రీవిద్య కోసం తిరుగుబాటు చేసిన విప్లవోద్యమకారిణి సావిత్రిబాయి పూలే అని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక కన్వీనర్ ఎల్ఎస్.భాస్కరరావు, ఇండియన్ బ్యాంక్ మేనేజర్ దుర్గారావు అన్నారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలోనే మహిళలందరికీ విద్యను అందించాలన్న లక్ష్యంతో పట్టుదలతో ఎన్నో అవమానాలను ఎదుర్కొని భారత దేశంలో మొట్టమొదటి పాఠశాలను బాలికల కోసం స్థాపించి చరిత్రలో నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో టెంటు అప్పారావు, గ్రంథాలయం నిర్వాహకురాలు షేక్ పరివిన తేలు శ్యామల, శివపార్వతి, అనంత ధనలక్ష్మి, పద్మ పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : మహిళలు వివక్షతకు గురయ్యే రోజుల్లో పలు పాఠశాలలు ఏర్పాటు చేసి వారిని విద్యావంతులను చేసి, చైతన్యవంతం చేసిన మహోన్నతమైన వ్యక్తి సావిత్రి బాయి పూలే అని ఆగిరిపల్లి మండల ఎంపిపి గోళ్ల అనూష అన్నారు. ఎస్‌టియు ఆధ్వర్యంలో ఎంపిపి జి.అనూషను, ఆగిరిపల్లి గ్రామ సర్పంచి సిహెచ్.లక్ష్మీ విక్టర్‌బాబును సన్మానించారు. అనంతరం వారి చేతుల మీదుగా ఎస్‌టియు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు ఆగిరిపల్లి మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎ.వెంకటేశ్వరరావు, ఎం.వేణుగోపాలరావు, ఎస్‌టియు నాయకులు సురేష్ కుమార్, నరసింహరావు, అబ్దుల్ హక్ పాల్గొన్నారు.

మిర్చి రైతులను ఆదుకోవాలని వినతి

ప్రజాశక్తి - ముసునూరు

నులిపురుగు ఉధృతి వలన పంట నష్టం సంభవిస్తుందని, ఈ నులిపురుగు రాష్ట్ర విపత్తుగా పరిగణించి రైతులను ఆదుకోవాలని జిల్లా రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నిమ్మగడ్డ నరసింహ అన్నారు. మండలంలోని వలసపల్లిలో గుడిపాడు, గొల్లపూడి గ్రామాల్లోని మిర్చి తోటలను ఆయా గ్రామాల రైతులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నులిపురుగులతో పంట అంతా మూసుకుపోయి పూత, పింద రాలిపోవడంతో రైతులు పూర్తిగా నష్టపోయే పరిస్థితి వచ్చిందన్నారు. ఇప్పటికే గత నాలుగు నెలల నుంచి సాగు చేయడానికి కౌలు కాకుండా రూ.లక్ష పెట్టుబడి పెట్టగా కనీసం పెట్టుబడి కూడా రాని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎప్పుడూ కూడా 20 నుంచి 30 క్వింటాలు అయ్యే మిర్చి దిగుబడి ఈ సంవత్సరం కనీసం రెండు మూడు క్వింటాలు కూడా అయ్యే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వలసపల్లి, ధర్మాజీగూడెం రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మండల కేంద్రమైన తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి డిప్యూటీ తహశీల్దార్ వి.కుమారికి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం వచ్చేలా కృషి చేయాలని వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మండల రైతు సంఘం అధ్యక్షులు పామర్తి శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి పిల్లి మురళి, రమేష్, శ్రీను, రాంబాబు, జగదీష్, పుల్లారావు, నాగేష్, ఏసుబాబు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు, రైతులు

విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస శిక్షణా తరగతులు



విద్యార్థులకు ప్రశంసపత్రాలు అందిస్తున్న మానవతా సభ్యులు

ప్రజాశక్తి - భీమడోలు

స్వచ్ఛంద సంస్థ మానవతా భీమడోలు శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వ్యక్తిత్వ వికాస శిక్షణా తరగతుల సేవలను విద్యార్థులు వినియోగించుకొని భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని మానవతా జిల్లా అధ్యక్షులు రామిశెట్టి గంగాధరరావు కోరారు. శాఖ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా మంగళవారం గుండుగొలను, పొలసానిపల్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకులం పాఠశాలలో శిక్షణా తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మానవతా వ్యక్తిత్వ వికాస విభాగం డైరెక్టర్లు టివి.ఉమామహేశ్వరరావు, టి.మోహనరావు, గుళ్ల నూకరాజు వివిధ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం శాఖ అధ్యక్షులు పచ్చా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మండల స్థాయిలో వివిధ అంశాల్లో ప్రతిభ కనపరిచిన 23 మంది పదో తరగతి విద్యార్థులకు ప్రసంశాపత్రాలు, మెమెంటోలు, నిఘంటువులు, నగదు పురస్కారాలు అందించారు.

గ్రామసభలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - భీమడోలు

గ్రామపంచాయతీ పరిధిలో సంవత్సరానికి నాలుగు సార్లు నిర్వహించే ప్రత్యేక గ్రామసభల సేవలను వినియోగించుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి మల్లికార్జునరావు కోరారు. గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో మంగళవారం గ్రామ సర్పంచి సునీత మాన్ సింగ్ అధ్యక్షతన గ్రామసభను నిర్వహించారు. తొలుత సామాజిక విప్లవకారిణి సావిత్రిబాయి పూలే జయంతి పురస్కరించుకుని జాతీయ మహిళా ఉపాధ్యాయురాలి దినోత్సవం నిర్వహించారు. సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన గ్రామసభకు ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా పంచాయతీ అధికారి మాట్లాడుతూ ప్రత్యేక గ్రామసభ పట్ల విస్తృత స్థాయి ప్రచారం జరిపి ఎక్కువ సంఖ్యలో ప్రజలు హాజరయ్యే విధంగా చైతన్య పరచాలని కోరారు. భీమడోలును ప్లాస్టిక్ రహిత గ్రామపంచాయతీగా తీర్చిదిద్దాలని కోరారు. గ్రామపంచాయతీ స్థాయిలో పారిశుధ్యంపై చేస్తున్న వ్యయం ఎక్కువగా ఉన్నందున క్రమబద్ధీకరించుకోవాలని సూచించారు. అనంతరం అంగన్ వాడీ కార్యకర్తలు ,వెలుగు కార్యకర్తలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యదర్శి ఎన్.ఠాగూర్ ప్రత్యేక గ్రామసభలను నిర్వహించాల్సిన ఆవశ్యకత గురించి వివరించారు. సర్పంచ్ సునీత మాన్ సింగ్ ప్రజలు గ్రామసభల సేవలను వినియోగించుకుని పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమానికి అతిథిగా పాల్గొన్న మండల పరిషత్ అభివృద్ధి అధికారి గ్రామపంచాయతీ పరిధిలో బాలల గ్రామసభ, మహిళల గ్రామసభ ప్రత్యేకంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు తుమ్మగుంట భవానిరంగా, ఎంపిటిసి సభ్యులు ముళ్లగిరి జాన్సన్, స్థానిక ప్రముఖులు రామిశెట్టి గంగాధరరావు పాల్గొన్నారు.



ప్రత్యేక గ్రామసభలో మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి

నూజివీడులో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'

ప్రజాశక్తి - నూజివీడు

రాష్ట్రంలో ఏ వర్గ ప్రజానీకం జీవించే పరిస్థితి లేకుండా జగన్మోహన్‌రెడ్డి పరిపాలన కొనసాగిస్తున్నారని టిడిపి నూజివీడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముద్రబోయిన వెంకటేశ్వరరావు విమర్శించారు. పట్టణంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. జగన్ పాలన వైఫల్యాలను ఎండగడుతూ ముద్రించిన కరపత్రాలను పలు వ్యాపార దుకాణాలు, ఇంటింటికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముద్రబోయిన వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎంతోకాలం ఈ రాక్షస పాలన కొనసాగదని, తరిమికొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని తెలిపారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా చంద్రబాబుకు ఓటు వేసి సుపరిపాలన కోసం ప్రజలంతా ఎదురుచూస్తున్నట్లు ముద్రబోయిన వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా వాణిజ్య విభాగ కమిటీ అధ్యక్షులు కెకె.బాబు, టిడిపి పట్టణ అధ్యక్షులు మలిశెట్టి జగదీష్, మండల అధ్యక్షులు ముసునూరు రాజా, సీనియర్ నేత యనమదల సత్యనారాయణ (నాని), నేతలు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతిరోజూ వ్యాయామం చేయాలి

ప్రజాశక్తి - ముసునూరు

ప్రతిఒక్కరూ క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తే చక్కటి ఆరోగ్యవంతులుగా ఉంటారని, ఫిజియోథెరపీ అవసరం ఉండదని ఫిజియోథెరపిస్ట్ జి.ప్రశాంతి అన్నారు. మండల కేంద్రమైన ముసునూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు హెచ్.అన్నామణి ఆధ్వర్యంలో అవసరాలు గల పిల్లలకు ఫిజియోథెరపీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఎంఎల్‌వి.నారాయణరావు పాల్గొన్నారు.

నవోదయకు బండివారిగూడెం విద్యార్థి

ప్రజాశక్తి - టి.నరసాపురం



వైష్ణవి

మండలంలోని బండివారిగూడెం ఎంపి యుపి పాఠశాలలో చదువుతున్న విద్యార్థి కొలుకులూరి వైష్ణవి జవహర్ నవోదయలో ఆరో తరగతిలో ప్రవేశానికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాస్ తెలిపారు. స్థానిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న వైష్ణవి ఇటీవల ఫలితాలు వెలువడిన రెండో జాబితాలో నవోదయలో ఆరో తరగతి ప్రవేశానికి అర్హత సాధించినట్లు తెలిపారు. వైష్ణవిని సర్పంచితో పాటు పాఠశాల సిబ్బంది, గ్రామ పెద్దలు అబినందించారు.

'అప్పుల ఊబిలో రాష్ట్రం'

ప్రజాశక్తి-ముదినేపల్లి

రాష్ట్రం అప్పుల ఊబిలో కురుకుపోయిందని కాంగ్రెస్ పార్టీ మీడియా కమిటీ ఛైర్మన్ ఎన్.తులసీరెడ్డి అన్నారు. ముదినేపల్లిలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ ముదినేపల్లి మండల ఎస్‌సి సెల్ కన్వీనర్ గోళ్ల రాజ్‌కుమార్ నివాసం వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఆరాచక, అవినీతి, డ్రగ్, జూదాం, గంజాయి, మద్యం ఆంధ్రప్రదేశ్‌గా అన్నీ విధాలుగా రాష్ట్రాన్ని అధ్వానంగా మార్చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రంలో మళ్లీ పూర్వ వైభవం తీసుకువస్తామన్నారు. ఈ సమావేశంలో కైకలూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి మంగినేని బాబ్జి, కైకలూరు, మండవల్లి, కలిదిండి మండలాల కాంగ్రెస్ పార్టీ కన్వీనర్లు కె.నాగరాజ్‌గౌడ్, కె.శ్రీరామకృష్ణ, సోము కాశీవిశ్వనాథ్, జిల్లా పార్టీ ఎస్‌సి సెల్ వైస్ ప్రెసిడెంట్ మద్దిరాల సంజీవరావు పాల్గొన్నారు.

ఘనంగా చింతమనేని పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - దెందులూరు

దెందులూరు మాజీ ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ పుట్టినరోజు వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు రక్తదానం చేశారు. పేదలకు కేక్‌లు, పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

చాట్రాయి : దెందులూరు నియోజకవర్గ మాజీ ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ పుట్టినరోజు సందర్భంగా చాట్రాయి మండలంలోని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవరెడ్డి పార్టీ నాయకులతో కలిసి చింతమనేనిని ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో పాటు మాజీ ఎంపిపి కందుల కృష్ణ, మండల కార్యదర్శి కంచర్ల హనుమంతరావు, పలగాని లక్ష్మీనారాయణ, బొర్ర నాగేశ్వరరావు, పానుగళ్ల కోటేశ్వరరావు, శ్రీనివాసరావు ఉన్నారు.

చింతలపూడి : టిడిపి దెందులూరు మాజీ ఎంఎల్ఎ, మాజీ చీఫ్ విప్ చింతమనేని ప్రభాకర్ పుట్టిన రోజును సందర్భంగా చింతమనేని యువసేన రాష్ట్ర నాయకులు అట్లూరి శ్రీనివాసరావు (ఇసక శ్రీను) ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి చింతలపూడి ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దొడ్డేగర్ల ప్రభాకర్, కొత్తపూడి శేషగిరి, చీకటి మురళి, నల్లమాటి రామకృష్ణ, కర్లపూడి రాజారత్నం, తాటి అప్పారావు, కంభం రమేష్, కంచర్ల అబ్రహం, బోడా నాగభూషణం, మన్నెం సత్తిబాబు, సొంగ ఏసుపాదం, మద్దా పండు, కె.రవి, బి.వెంకటేశ్వరరావు, మట్టా సత్యనారాయణ, మారుమూడి రాజేష్, చుండ్రు చంద్రరావు పాల్గొన్నారు.దెందులురు మాజీశాసనసభ్యులు పుట్టిన రోజు సందర్భంగా చింతలపూడి టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కోండ్రుదేవా అధ్వర్యంలో 54 కేజిల కేక్ కట్ చేశారు.

మద్ది ఒక్కరోజు ఆదాయం రూ.1.09 లక్షలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయానికి ఒక్కరోజు ఆదాయం.1,09,697 సమకూరిందని ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎ.కొండలరావు తెలిపారు. మంగళవారం ఆలయాన్ని యాత్రికులు అధిక సంఖ్యలో సందర్శించారని తెలిపారు. ఈ నేపథ్యంలో 800 మంది యాత్రికులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. ఆలయ సిబ్బంది ధర్మకర్తల మండలి సభ్యులు ఛైర్మన్ కేసరి సరిత విజయభాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

కురెళ్లగూడెంలో అన్నదానం

ప్రజాశక్తి - భీమడోలు

ముక్కోటి ఏకాదశి పురస్కరించుకుని కురెళ్లగూడెం గ్రామంలో కృష్ణాలయం వద్ద అన్న సమారాధన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిడిపి ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులను ఆయన అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో భీమడోలు జెడ్‌పిటిసి మాజీ సభ్యులు కరణం పెద్దిరాజు పాల్గొన్నారు.